## పర్ణశాలలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పర్ణశాల, నవంబర్ 27 : కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శివాలయంలో ఎంతో భక్తిశ్రద్ధలతో మహిళలు కార్తీక పౌర్ణమి పూలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నుంచి కార్తీక పౌర్ణమి గడియలు తగలడంతో ఆ సమయం నుంచి శైవ విష్ణు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం తెల్లవారుజాము నుంచి మహిళలు గోదావరి నదిలో పౌర్ణమి స్నానం ఆచరించి దీపారాధన చేసి వెలిగించిన దీపాలను గోదావరిలో వదిలారు. శివాలయాలకు వెళ్లి ధ్వజ స్తంభాల వద్ద దీపారాధన కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు.

## దుమ్ముగూడెంలో ఇంటింటి ప్రచారం

పర్ణశాల, నవంబర్ 27 : రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30వ తేదీన జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా భద్రాచలం నియోజకవర్గం దుమ్ముగూడెం మండలంలో గత నెల రోజులుగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపించాలని కోరుతున్నారు. జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీపీ రేసు లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు అన్నెం సత్యనారాయణమూర్తి, రైతు నాయకులు సాగి శ్రీనివాస రాజు, రాముడు, జానీపాషా, కెల్లా శేఖర్, రైస్ మిల్లు బుజ్జి, మట్ట వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# కారు గుర్తుపై ఓటేసి తెల్లంను గెలిపించాలి



వాజేడులో తిరుపతియాదవ్ నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



వెంకటాపురం : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

వాజేడు, నవంబర్ 27 : భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపు కోరుతూ సోమవారం వాజేడు మండల కేంద్రంతోపాటు నాగారం, జంగాపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ముడిగ తిరుపతి నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు ఇప్పుడు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి డాక్టర్ తెల్లం వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గొంది రమణబాబు, కల్లూరి సతీశ్, చెన్నం స్వామి, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### వెంకటాపురం మండలంలో..

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 27 : భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వెంకటాపురం మండలంలోని గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశాయి. వాజేడు, వెంకటాపురం ఎన్నికల కో కన్వీనర్ గూడవర్తి నర్సింహమూర్తి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిడెం రవికుమార్ ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వేల్పూరి లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి పిల్లారశెట్టి మురళి, నాయకులు ముడుంబా శ్రీనివాసరావు, శాంతమూర్తి, జక్కుల సమ్మయ్య, బొల్లె శంకర్రావు పాల్గొన్నారు.

# రామయ్యకు ముత్తంగి అలంకరణ

## ఆలయాల్లో కార్తీక పూజలు

భద్రాచలం/ చర్ల/ దుమ్ముగూడెం, నవంబర్ 27 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను ధరింపజేశారు. ఈ ప్రత్యేక వస్త్రాలంకరణలో సీతారాములు మరింత రమణీయంగా భక్తులకు దర్శనమివ్వడంతో వారు మురిసిపోయారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్యహోమాలు నిత్య బలిహరణం తదితర కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు.

### భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు తెల్లవారుజామున గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, గోదావరి తీరంలో తులసి మొక్కను నాటి కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయంలో, ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద, ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగించగా మరికొంతమంది శివాలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. అనంతరం భద్రాద్రి రామయ్యను దర్శించుకునేందుకు క్యూలైన్లలో వేచి ఉండి, స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని ఊహించి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగలేదు. పాతచర్లలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంతోపాటు చర్ల మండలంలోని అన్ని ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దుమ్ముగూడెం మండలం నర్సాపురం ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంతోపాటు ఇతర ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.



శివాలయంలో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



దుమ్ముగూడెం : కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చర్ల ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకదీపాలు

### ఘనంగా కృత్తికా దీపోత్సవం

భద్రాచలం, నవంబర్ 27 : భద్రాచలం దివ్యక్షేత్రంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం రాత్రి కృత్తికా దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా తిరుమంగైఆళ్వార్ తిరునక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారి ఉత్సవమూర్తులను, తిరుమంగైఆళ్వార్‌ను పల్లకిలో ఊరుగింపుగా బేడా మండపానికి తీసుకొచ్చారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 25వెండి కలశాలతో స్నపన తిరుమంజనం, పంచామృతాలతో, హరిద్రా చూర్ణంతో, తులసి మాలలతో అభిషేకం జరిపి, హారతులు సమర్పించారు. అనంతరం యాగశాలలో అభిషేకం హోమం జరిపారు. సాయంత్రం 6గంటలకు యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. కృత్తికా దీపోత్సవాన్ని పురస్కరించుకొని సాయంత్రం అగ్నిగుండంలో నుంచి తీసుకొచ్చిన జ్వాలతో బేడా మండపంలో ఉత్సవ మూర్తుల పంచ దీపాలను వెలిగించారు. ఒక దీపాన్ని మూలవిరాట్ వద్ద, మరోదీపాన్ని లక్ష్మీతాయరు సన్నిధిలో, మూడో దీపాన్ని ఆంజనేయస్వామి వద్ద, నాల్గో దీపాన్ని పరివార దేవతల సన్నిధిలో, ఐదో దీపాన్ని బలిపీఠం వద్ద ఉంచారు. ఆలయ భటుడి శిరస్సుపై ఒక దీపాన్ని ఉంచి చప్టా దిగువన ఉన్న రథశాల ఎదురుగా ఉంచిన గడ్డివాములో దీపాన్ని వేసి చొక్కాసుర దహనం చేశారు. అనంతరం స్వామివారికి తిరువీధి నిర్వహించారు. ప్రతి యేటా కార్తీక పౌర్ణమి రోజున కృత్తికా నక్షత్రం సందర్భంగా కృత్తికా దీపోత్సవాన్ని పోలీసుశాఖ వారి ఆధ్వర్యంలో గత 30ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. సోమవారం రోజున పోలీసులు వారి కుటుంబ సభ్యులతో రామాలయంలో కొన్ని వేల దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ పరతోశ్ పంకజ్, సీఐ నాగరాజ్ రెడ్డి, ఎస్సైలు మధుప్రసాద్, పీవీఎన్ రావు పాల్గొన్నారు. మంగళవారం నుంచి స్వామివారి నిత్య కల్యాణాలు యథావిధిగా ప్రారంభమవుతాయని ఆలయ అధికారులు తెలిపారు.



స్వామివారికి సహస్రధారలతో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

## నన్ను విమర్శించే స్థాయి బాలసానికి లేదు

- ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడతరు
- మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆరే
- ఎమ్మెల్సీ, భద్రాచలం ఎన్నికల ఇన్‌చార్జి తాతా మధుసూదన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, భద్రాచలం ఎన్నికల ఇన్‌చార్జి తాతా మధుసూదన్

భద్రాచలం, నవంబర్ 27 : నన్ను విమర్శించే స్థాయి, అర్హత బాలసాని లక్ష్మీనారాయణకు లేదని ఎమ్మెల్సీ, భద్రాచలం ఎన్నికల ఇన్‌చార్జి తాతా మధుసూదన్ అన్నారు. సోమవారం భద్రాచలంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడతారని, ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ సారే ఉంటారని తెలిపారు. వారంరోజులుగా కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతున్నదని, అన్ని సామాజిక వర్గాలు కేసీఆర్‌తోనే ఉన్నారని అన్నారు. 24గంటల కరెంట్, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు, తదితర పథకాలు అమలు కావాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. బీఆర్ఎస్ పాలించిన ఈ తొమ్మిదిన్నర ఏళ్లలో ఎక్కడా మత ఘర్షణలు లేవని, ఎంతో ప్రశాంతంగా రాష్ట్రం ఉన్నదని, సుస్థిర పాలన అందించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. ఇప్పటికే పలు సర్వేలు బీఆర్ఎస్‌దే విజయమని, సీఎం కేసీఆరే ముఖ్యమంత్రిని తెలిపాయన్నారు. భద్రాచలం నియోజకవర్గ ప్రజలు ఈసారి డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపిస్తారని అన్నారు. రైతుబంధును ఆపి రైతుల కడుపులు కొట్టిన పార్టీ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు ఓటర్లు కర్రు కాల్చి వాత పెట్టాలని కోరారు. అధికారంలోకి రాకముందే మూడు గంటల కరెంట్ చాలు, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, రైతుల కష్టం వీరికి తెలుసా అని ప్రశ్నించారు. మూడున్నర దశాబ్దాలుగా టీడీపీలో ఉన్న బాలసాని బీఆర్ఎస్‌లో చేరి పదవులు అనుభవించి, బీఆర్ఎస్‌లో ఇమడలేక నెలరోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరి సీఎం కేసీఆర్‌నే విమర్శిస్తున్నాడని, అవకాశవాద రాజకీయం చేస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ వాళ్ల కంటే ఎక్కువ చిలక పలుకులు పలుకుతున్నాడని అన్నారు. డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ గత రెండు దఫాలుగా ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయానని, ఈసారి సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మళ్లీ పోటీ చేస్తున్న తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తాను గెలిస్తే భద్రాచలం నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నిలుపుతానని, కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెల్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు తిప్పన సిద్ధులు, రవిచంద్ర, ఆకోజు సునిల్‌కుమార్, తాండ్ర వెంకటరమణారావు పాల్గొన్నారు.